# నగదు లావాదేవీలపై నిఘా పెంచాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

- అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంక్ అధికారులు దృష్టి సారించాలి
- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 12: సంగారెడ్డి జిల్లాలో అనుమానాస్పద బ్యాంకు లావాదేవీల వివరాలు అందించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ రూ.లక్ష నగదు డిపాజిట్ చేసినా, విత్‌డ్రా చేసినా, అదేవిధంగా రూ.10లక్షలకు పైబడి నగదు ట్రాన్స్‌ఫర్ చేసినా బ్యాంకు లావాదేవీల వివరాలను అందించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసినట్లయితే జాప్యం చేయకుండా చెక్‌బుక్ జారీ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎల్‌డీఎం గోపాల్‌రెడ్డి, డీఆర్వో నగేశ్, డీసీవో, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు

## జోనల్ మీట్‌కు గురుకుల విద్యార్థులు

రామాయంపేట అక్టోబర్ 12: రామాయంపేట పట్టణంలోని తెలంగాణ గురుకుల విద్యాలయానికి చెందిన 80మంది విద్యార్థులు జోనల్ మీట్‌లో పాల్గొనేందుకు రాజన్నసిరిసిల్లా జిల్లాకు బయలుదేరారు. గురువారం గురుకుల విద్యాలయానికి చెందిన 80మంది విద్యార్థులు, నలుగురు టీచర్లు తరలివెళ్లారు. శుక్రవారం నుంచి అక్కడ జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వెళ్లినట్లు గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ సరళాదేవి తెలిపారు. నాలుగు రోజులపాలు జరిగే వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఇతర ఆటల్లో పాల్గొనేందుకు విద్యార్థులను ఆర్టీసీ బస్సులో తరలించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


ఇబ్రహీంపూర్‌లో అక్రమంగా నిల్వ ఉన్న మద్యాన్ని పట్టుకున్న పోలీసులు


## అక్రమ మద్యం నిల్వలపై చట్టపరమైన చర్యలు

చేగుంట, అక్టోబర్ 12: అక్రమంగా మద్యం నిల్వఉంచితే చర్యలు తీసుకుంటామని చేగుంట ఎస్‌ఐ హరీశ్‌గౌడ్ హెచ్చరించారు. మండలంలోని ఇబ్రహీంపూర్‌కు చెందిన రాజయ్య హోటల్‌లో అక్రమంగా మద్యం బాటిల్ పెట్టి ప్రజలకు అధిక ధరలకు అమ్ముకుంటున్నాడనే సమాచారం మేరకు గురువారం పోలీసులు హోటల్‌పై దాడి చేశారు. సుమారు రూ.70వేల విలువైన మద్యం బాటిళ్లను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

# బాధితులకు మొబైళ్ల అప్పగింత

### మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మెదక్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): చోరీకి గురైన 15 మొబైళ్లను గుర్తించి ఎస్పీ రోహిణిప్రియదర్శిని ఆదేశాల మేరకు బాధితులకు అప్పగించామని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పోయిన లేదా చోరీ గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ) అనే వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలను నమోదు చేసుకున్నట్లయితే మొబైల్స్‌ను ఈ పోర్టల్‌లో సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందన్నారు. పోర్టల్ నిర్వహణకు సంబంధించి అన్ని పోలీస్‌స్టేషన్లలో నోడల్ అధికారులను నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. ఈ పోర్టల్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించామని, జిల్లావ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీ జరిగిన 15 మొబైళ్లను రికవరీ చేశామన్నారు. వినియోగదారులు మొబైల్స్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే సంబంధిత వివరాలతో ఐఎంఈఐ, మొబైల్ నంబర్, బిల్, మీసేవ రసీదు, పోలీస్‌స్టేషన్, మండలం, జిల్లా, రాష్ట్రం, పిన్‌కోడ్ మొదలగు వివరాలతో పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేయడం వల్ల ఫోన్ ఐఎంఈఐ బ్లాక్ చేయబడి ఫోన్ పనిచేయదన్నారు. ఇందులో ఎవరైనా సిమ్‌కార్డ్ వేసుకుంటే ట్రేసబులిటీ రిపోర్ట్ వస్తుందని, దీని ఆధారంగా పోయిన మొబైల్ లొకేషన్ గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు. పోయిన సెల్‌ఫోన్లను అశ్రద్ధ చేస్తే ఫోన్లో ఉన్న వ్యక్తిగత సమాచారం, ఆధారాలు దొంగిలించి నష్టాన్ని కలగజేయడంతోపాటు వ్యక్తిగత భద్రతకు, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. దొంగిలించిన ఫోన్‌తో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నదని, ప్రజలు ఎవరైనా మొబైల్స్ పోగొట్టుకున్నా లేదా చోరీ జరిగినా సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ దిలీప్‌కుమార్, ఐటీ కోర్ కానిస్టేబుళ్లు విజయ్, మహేందర్ పాల్గొన్నారు.



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

## సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, అక్టోబర్ 12: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతీ,యువకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. కాచిగూడలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీర్, పాలిటెక్నిక్, డిప్లొమా చదివిన యువత గురువారంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7893141797, ఆన్‌లైన్‌లో www.nacsindia.orgలో సంప్రదించాలన్నారు.

## లా కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ప్రకటనలో తెలిపారు. మూడేండ్ల ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌బీ ఆనర్స్, ఐదేండ్ల బీఏఎల్‌ఎల్‌బీ, బీబీఏ ఎల్‌ఎల్‌బీ, బీకామ్ ఎల్‌ఎల్‌బీ తదితర కోర్సుల సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో
కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, బీఐఎస్ ప్రతినిధులు, అధ్యాపకులు

## 120 మంది విద్యార్థులతో బీఐఎస్ స్టాండర్డ్స్ క్లబ్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 12: ప్రపంచ భద్రతా వారోత్సవాల సందర్భంగా 120మంది విద్యార్థులతో బీఐఎస్ క్లబ్ ఏర్పాటు చేసినట్లు తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సహకారంతో గురువారం తారా ప్రభుత్వ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) ఆధ్వర్యంలో వస్తు నాణ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచ నాణ్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విధులు, ప్రాముఖ్యత, వస్తు నాణ్యతా ప్రమాణాల ఆవశ్యకతను వివరించారు. తారా కళాశాలలో 120మంది విద్యార్థులతో బీఐఎస్ స్టాండర్డ్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. నాణ్యతాప్రమాణాలు కలిగిన వస్తువుల వినియోగంతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమన్నారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ దిలీప్, స్టాండర్డ్స్ ప్రమోషన్ అధికారి అభిసాయి, ప్రధాన రిసోర్స్ అధికారి గాంధారి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో 90శాతం వస్తువులు నాణ్యత లేవని తెలిసినా వినియోగించడం ఆందోళనకరమైన పరిణామమన్నారు. నాణ్యతాప్రమాణాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు 'కొనసాగించగలిగే అభివృద్ధి', 'నాణ్యతాప్రమాణాలు లేని ప్రపంచం' అనే అంశాలపై వ్యాసరచన, స్కిట్, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ విశ్వేశ్వరశర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.12 లక్షల నగదు పట్టివేత

వెల్దుర్తి, అక్టోబర్ 12: పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించిన వాహనాన్ని తనిఖీ చేయగా రూ.12 లక్షల నగదు పట్టుబడినట్లు తూప్రాన్ సీఐ శ్రీధర్ తెలిపారు. గురువారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మధుసూదన్‌గౌడ్‌తో కలిసి పట్టుకున్న నగదును చూపించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా వెల్దుర్తి ఎస్సై మధుసూదన్‌గౌడ్ గురువారం వెల్దుర్తిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కారు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా రూ.12 లక్షల నగదు పట్టుబడిందన్నారు. పట్టుకున్న నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు, రసీదులు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకొని ఎలక్షన్ మానిటరింగ్ సెల్ విభాగానికి అప్పగించామని చెప్పారు. నగదు సంబంధిత వ్యక్తులు తగిన ఆధారాలను చూపించి నగదును తీసుకోవచ్చన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరూ రూ.50 వేలకు మించి నగదును తరలించరాదని, నగదు ఉంటే అం దుకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. బాధితురాలు వరలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ఉప్పులింగాపూర్ వద్ద వ్యవసాయ భూమిని కొనుగోలు చేశానని, ఆ భూమి రిజిస్ట్రేషన్ ఉండడంతో అమ్మిన వ్యక్తికి ఇవ్వడానికి డబ్బులు తీసుకువచ్చానని తెలిపారు.



పట్టుకున్న నగదును చూపిస్తున్న
తూప్రాన్ సీఐ శ్రీధర్, వెల్దుర్తి ఎస్సై మధుసూదన్‌గౌడ్

## డీఈఎల్ ఈడీ, డీపీఎస్ఈ పరీక్ష ఫీజు చెల్లించాలి

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 12: డీఈఎల్ఈడీ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్), డీపీఎస్ఈ(డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్) మొదటి సంవత్సరం అభ్యర్థులు, ఫెయిలైన వారు ఈనెల 27వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని విద్యాశాఖ అధికారి విజయకుమారి ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో నవంబర్ 3వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను, కార్యాలయ వెబ్‌సైట్ www.bse.telangana. gov.in ను సంప్రదించాలని సూచించారు.

## ఉర్దూ వర్సిటీలో బీఈడీ, పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను)లో 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన నోటిఫికేషన్ బుధవారం ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విడుదల చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 16న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లు యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నారు. సీటు పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఈనెల 19, 20వ తేదీ వరకు గడువు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం manuu.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.